ప్రజాశక్తి

బుధవారం 17 డిసెంబరు 2025



నేడు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పర్యటన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

ఎచ్చెర్లలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటిలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ బుధవారం పర్యటించనున్నారని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కె.వి.డి బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. పోష్ చట్టంపై నిర్వహించే అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ చట్టంపై విద్యార్థులకు ఆమె అవగాహన కల్పిస్తారని తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి విమల కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారని పేర్కొన్నారు.

కప్పం కట్టాల్సిందేనా..?

- అసోసియేషన్‌కు పది శాతం కమీషన్ చెల్లిస్తేనే మిల్లులకు ధాన్యం
- ధాన్యం ఇవ్వకుండా చక్రం తిప్పుతున్న మిల్లర్ల పెద్ద
- బెదిరిస్తూ, భయపెడుతూ బలవంతపు వసూలు
- అధికారులకు వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

ఏదైనా ఒక అసోసియేషన్ ఉందంటే అది అందులోని సభ్యుల కష్టసుఖాలను పంచుకోవాలి. తమ కార్యకలాపాల్లో వారు పడుతున్న ఇబ్బందులను తీర్చాలి. జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ మాత్రం అందుకు భిన్నంగా తోటి మిల్లర్లనే ఇబ్బంది పెట్టేలా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసోషియేషన్ ఖర్చుల కోసం కొంత మొత్తం డబ్బులు ముట్టజెప్పాలని బలవంతం చేస్తున్నట్లు తెలుస్తోంది. అలా డబ్బులు చెల్లించడానికి నిరాకరించిన మిల్లర్లకు ధాన్యం ఇవ్వకుండా అసోసియేషన్ పెద్దలు కొందరు అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది. వీటిపై ఇప్పటికే జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందుతున్నట్లు సమాచారం.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి


జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 6.50 లక్షల ధాన్యాన్ని సేకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ రైస్ మిల్లింగ్(సిఎంఆర్) కోసం మిల్లులకు అప్పగించనుంది. ప్రభుత్వం పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం ధాన్యం సేకరణకు ఆసక్తి చూపిన 270 మిల్లులను ఎంపిక చేశారు. మిల్లు సామర్థ్యం, వారు చెల్లించే బ్యాంకు గ్యారంటీ ఆధారంగా జిల్లా అధికారులు వారికి ధాన్యం కేటాయిస్తారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ధాన్యం కేటాయింపుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మిల్లర్లు రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది. పోలాకి మండలంలోని శ్రీదుర్గా మోడరన్ రైస్ మిల్లు ప్రొప్రయిటర్ తమ్మినేని భూషణరావు ఇటీవల గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదు అసలు విషయం బయటపడింది. జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులు డబ్బులు తీసుకుని ధాన్యం టార్గెట్లు వేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే దీని వెనుక అసలు కథ వేరుగా ఉన్నట్టు తెలుస్తోంది.



ఆమదాలవలస మండలం అక్కివరం వద్ద ధాన్యం లోడ్లతో లారీలు

అసోషియేషన్ పెద్దలే మోకాలడ్డుతున్న వైనం

తోటి మిల్లర్లకు ధాన్యం ఇవ్వకుండా అసోసియేషన్‌కు చెందిన పెద్దలే మోకాలడ్డుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు ఆర్థిక లావాదేవీలే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అసోసియేషన్ ఖర్చుల కోసం డబ్బులు ఇచ్చిన వారికే ధాన్యం కేటాయింపులు చేసేలా చక్రం తిప్పుతున్నట్టు తెలుస్తోంది. మిల్లర్ల వ్యాపారంలో ప్రతిఒక్కరూ పది శాతం కమీషన్ ఇవ్వడానికి అంగీకరించిన వారికే ధాన్యం పంపుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం బెదిరింపులకు సైతం దిగుతున్నట్లు మిల్లర్లలో చర్చ నడుస్తోంది. అసోసియేషన్‌కు డబ్బులు ఇవ్వకుంటే ధాన్యం రావంటూ భయపెడుతున్నట్లు తెలిసింది. కోట్ల రూపాయల బ్యాంకు గ్యారంటీలు ఇచ్చేసిన తర్వాత ధాన్యం రాకపోతే తీవ్రంగా నష్టపోతామని భావించిన కొందరు మిల్లర్లు భయపడి ముడుపులు చెల్లించినట్లు తెలుస్తోంది. గతంలో అసోసియేషన్ ఖర్చుల కోసం మూడు శాతం కమీషన్ తీసుకునే పరిస్థితి ఉండేది. ఇప్పుడు అమాంతంగా దాన్ని పది శాతానికి పెంచేయడంతో కొందరు మిల్లర్లు తిరగబడ్డారు. అందులో భాగంగా గ్రీవెన్స్‌తో పాటు జాయింట్ కలెక్టర్, కలెక్టర్‌కు ఫిర్యాదులు వస్తున్నట్లు తెలుస్తోంది.



మిల్లర్ల పెద్దే కీలక సూత్రధారి

మిల్లర్ల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేయడంలో కోటబొమ్మాళికి చెందిన ఓ మిలర్ల పెద్ద కీలక సూత్రధారిగా ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసోసియేషన్‌కు డబ్బులు ఇవ్వని మిల్లర్లకు ధాన్యం ఇవ్వకుండా జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులను సైతం శాసిస్తూ చెలరేగిపోతున్నట్లు తెలుస్తోంది. జిల్లాకు చెందిన ఒక ముఖ్య ప్రజాప్రతినిధి ఆశీస్సులతో పదవి చేపట్టిన ఆ నాయకుడు అధికార పార్టీ అండతో బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆ ఆరోపణల్లో వాస్తవం లేదు



డబ్బులు తీసుకుని ధాన్యం కేటాయిస్తున్నామన్న ఆరోపణల్లో వాస్తవం లేదు. మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో అవకతవకలకు ఆస్కారం లేదు. ఏ మిల్లుకు ఎంతమేర ధాన్యం కేటాయించాలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చూస్తున్నారు. మిల్లర్లకు ఏవైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తీసుకురావాలని చెప్పాం.

- వేణుగోపాల్, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్



జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులు

పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలపై పోరాటం

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు
- జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గిరిబుచ్చి రంగనాథ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.మోహనరావు, బి.రామారావు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం ఐక్యవేదిక ఆధ్వర్యాన జిల్లా సహకార అధికారి కార్యాలయం వద్ద పిఎసిఎస్ ఉద్యోగులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు ఆందోళనబాట పట్టారని తెలిపారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రభుత్వాన్ని కోరినా, ఒక్క సమస్య కూడా పరిష్కరించకపోవడంతో ఐక్యవేదిక పేరిట రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధమయ్యారని తెలిపారు. 36 జిఒ అమలు చేయాలని, 2019, 2024 పిఆర్‌సి ఇవ్వాలన్నారు. లేకుంటే 50 శాతం తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.రెండు లక్షల గ్రాట్యుటీ సీలింగ్ ఎత్తివేసి యాక్టు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. 2019 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలన్నారు.

సంఘాల లాభనష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 22న జిల్లా కేంద్ర సహకార కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. 29న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే జనవరి ఐదో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళ్లి నిరవధిక నిరాహార దీక్ష చేపడతామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తాత్సార వైఖరి విడనాడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జిల్లా సహకార అధికారి బి.మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బొడ్డేపల్లి సన్యాసిరావు, కె.లక్ష్మీనారాయణ, వై.పాపినాయుడు, జగదీష్, కె.సౌజన్య, ఎ.ఉమామహేశ్వరి, దాసు, జానకిరామ్, ఐ.వి మాధురి, కె.అనూష, ఎం.అశ్విని, 49 సంఘాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టెక్కలి ఇండోర్ స్టేడియంకు నిధుల మంజూరు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

టెక్కలి ఇండోర్ స్టేడియంకు తొలి విడతలో రూ.39 లక్షలు మంజూరయ్యాయి. ఈమేరకు రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం పనులకు సంబంధించి రూ.75 లక్షల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. తొలి విడత నిధులతో త్వరలోనే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించనున్నారు. అత్యాధునిక వసతులు కల్పించడం ద్వారా టెక్కలి ప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేందుకు వేదిక సిద్ధం కానుంది. దీంతో ఏళ్లుగా నాణ్యమైన క్రీడా సౌకర్యాల కోసం ఎదురుచూస్తున్న స్థానిక క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు టిడిపి నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

ఎయిర్‌పోర్టుకి భూములు ఇచ్చేది లేదు

అధికారులకు తేల్చిచెప్పిన భేతాళపురం రైతులు

ప్రజాశక్తి - మందస

కార్గో ఎయిర్‌పోర్టుకు భూములు ఇచ్చేది లేదని భేతాళపురం రైతులు అధికారులకు తేల్చిచెప్పారు. మండలంలోని భేతాళపురం సచివాలయం ప్రాంగణంలో పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్ అధ్యక్షతన కార్గో ఎయిర్‌పోర్టు బాధిత రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్గో ఎయిర్‌పోర్టు ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బాధిత రైతులు అంగీకరిస్తే ప్రభుత్వం నుంచి లాండ్ పూలింగ్ విధానం తీసుకొచ్చి, ఎకరాకు 25 సెంట్ల భూమి తిరిగి ఇస్తామని తెలిపారు. జిరాయతీ భూముల్లో ఉన్న చెట్లకు ప్రత్యేక ధర ప్రకటిస్తామని చెప్పారు. ప్రభుత్వ ధర కన్నా 2.5 రెట్లు అధికంగా చెల్లిస్తామన్నారు. బాధిత రైతులు మడియా రాజేశ్వరి మాట్లాడుతూ ప్రాణాలు పోయినా జీవనాధారమైన భూములను ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. తిత్లీ తుపాను తర్వాత చాలా నష్టపోయామని, అదే భూమిపై కష్టపడి కొబ్బరి చెట్లు పెంచి పెద్దవి చేసి పంట కాపుకొస్తున్న సమయంలో భూములు ఇవ్వాలంటే ఎలా అని కీలు గున్నమ్మ ప్రశ్నించారు. ఇచ్చిన డబ్బులు పది రోజుల్లో ఖర్చు చేసేస్తామని, అదే భూమి ఉంటే దానిపై బతుకుతామన్నారు. ఒక్క సెంటు భూమి కూడా ఇచ్చేది లేదన్నారు. ఉన్న నాలుగెకరాల భూమి పోతే ఎక్కడికి వెళ్లి బతకాలని బత్తిని ఉమాపతి ప్రశ్నించారు. సొంత ఇళ్లు కట్టడానికి డబ్బులు అవసరమైన సందర్భంలో బ్యాంకుకు వెళ్తే సవాలక్ష నిబంధనలు పెట్టారని గార ఆనంద్ తెలిపారు. మా భూమిపై ప్రైవేటు వ్యాపారి అరగంటలో రూ.ఐదు లక్షల అప్పు ఇచ్చారని, భూమి విలువను అర్థం చేసుకోవాలని కోరారు. కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ మీడియా వింగ్ కన్వీనర్ బత్తిని లక్ష్మణ్ మాట్లాడుతూ 15 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కార్గో ఎయిర్‌పోర్టుకి సంబంధించిన రైతులు ఎంతమంది, అవసరమైన భూమి ఎంత అని స్పష్టత ఇవ్వకుండా సుమారు 20 గ్రామాల్లో రైతులను మానసికంగా ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఒక్క సెంటు కూడా కార్గో ఎయిర్‌పోర్టుకి ఇచ్చేది లేదని తీర్మానం చేసిన పత్రాలను చూపించారు. ఎన్ని ఇచ్చినా అవేవీ పచ్చని భూములు కన్నా ఎక్కువ కాదన్నారు. కార్గో ఎయిర్‌పోర్టు వద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. సభలో రైతులు వ్యక్తపరిచిన అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు సమావేశం ముగించారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

డ్రగ్స్ రహిత సమాజం లక్ష్యం

'అభ్యుదయం యాత్ర'లో డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యమని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పాయకరావుపేటలో ప్రారంభించిన 'అభ్యుదయం సైకిల్ యాత్ర' సోమవారం శ్రీకాకుళం నగరానికి చేరింది. నగరంలోని రామలక్ష్మణ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలిలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానం వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గొండు శంకర్, బగ్గు రమణమూర్తి సైకిల్ తొక్కుతూ యాత్రలో భాగస్వామ్యమయ్యారు. సూర్యమహల్ కూడలి, జి.టి రోడ్డు, ఏడు రోడ్ల కూడలి మీదుగా ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో డిఐజి మాట్లాడుతూ మంచి సమాజ నిర్మాణం మంచి వ్యక్తుల వల్లే సాధ్యమవుతుందన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా చేపట్టిన అభ్యుదయం సైకిల్ యాత్ర 35 రోజులుగా విజయవంతంగా కొనసాగుతోందన్నారు. సుమారు వెయ్యి కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తూ ముఖ్య పట్టణాలు, గ్రామాల్లో ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. దేశానికి భవిష్యత్ అయిన యువత మాదకద్రవ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నా, ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరూ పోలీస్ శాఖ చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు.

జిల్లాలో గంజాయి నియంత్రణకు జిల్లా పోలీసు శాఖతో పాటు పలు శాఖల సమన్వయంతో పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ప్రతి కళాశాలలో సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ అందిస్తున్నామన్నారు. అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు కార్యక్రమం ఈనెల 29వ తేదీన ఇచ్ఛాపురంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ గంజాయి నిర్మూలనతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ యాత్ర ఉద్దేశమన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారాన్ని 1972, 112 నంబర్లకు స్థానిక పోలీసులకు అందించాలని, ఇచ్చే సమాచారం గోప్యంగా ఉంచుతామని హామీనిచ్చారు. సినీ నటుడు షకలక శంకర్ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో ఫొటో ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను తిలకించారు. విద్యార్థుల డ్రగ్స్ అడిక్ట్ వల్ల నష్టాలపై ఫ్లాష్‌మాబ్, జానపద నృత్యాలు, తప్పెటగుళ్లు, విద్యార్థులు చేసిన స్క్రిప్టులు ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్.తిరుపతి నాయుడు, అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, ఆర్‌డిఒ సాయిప్రత్యూష, డిఎస్‌పిలు వివేకానంద, లక్ష్మణరావు, డిసిఎంఎస్ చైర్మన్ అవినాష్ పాల్గొన్నారు.



అభ్యుదయం యాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



అభ్యుదయం సైకిల్‌యాత్ర సైకతశిల్పం

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కార్మికులపై పనిభారం తగ్గించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎన్.బలరాం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరితే అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నగర విస్తరణ స్థాయికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచకుండా కార్మికులపై పనిభారం మోపడం అన్యాయమన్నారు. పారిశుధ్య కార్మికుల భర్తీ పేరుతో కాంట్రాక్టు ఏజెన్సీలు రూ.లక్షలు వసూలు చేస్తున్నాయని, దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సిక్, డెత్, రిటైర్మెంట్ అయిన వారి స్థానాల్లో పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిటీ నియమించి, మున్సిపల్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలన్నారు. గత జూలైలో రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు 10 రోజులు, పారిశుధ్య కార్మికులు ఏడు రోజులు సమ్మె చేశారని, సమ్మెకాలపు జీతం చెల్లించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని, ఇందుకు సంబంధించి జిఒ జారీ చేయాలని కోరారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ఆప్కాస్ ద్వారా రిటైర్మెంట్ అవుతున్న వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ జిఒ జారీ చేయాలన్నారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు 'తల్లికి వందనం'తో సహా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు డిఎ బకాయిలు, సరెండర్ లీవ్‌లు, ఎన్‌క్యాష్‌మెంట్ తదితర వాటిని ఇవ్వాలన్నారు. క్లాప్ డ్రైవర్లకు ప్రతి నెలా జీతాలు చెల్లించడంతో పాటు జిఒ 36 ప్రకారం రూ.24,500 వేతనం చెల్లించాలన్నారు.

పిఎఫ్, ఇఎస్‌ఐ వాటా నిధులు సకాలంలో జమ చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. జిఒ నంబరు 161 ప్రకారం పిఆర్‌సి జీతాలు, డిఎ, మధ్యంతర భృతి, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ చెల్లింపు, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలన్నారు. చట్టబద్ధమైన సెలవులు, రక్షణ పరికరాలు, భద్రతా సౌకర్యాలు సకాలంలో కేటాయించాలని కోరారు. అర్హులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలన్నారు. ధర్నాకు సిఐటియు సీనియర్ నాయకులు ఎం.గోవర్ధనరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు టౌన్ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, నాయకులు ఎ.గణేష్, ఎ.జనార్ధనరావు, డి.చిట్టి, ఎ.వెంకటరమణ, ఎ.శంకర్, గణేష్, డి.గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

18న పెన్షన్, జిపిఎఫ్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ



జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 18న ఉదయం 10 గంటల నుంచి పెన్షన్, జిపిఎఫ్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఖజానా శాఖ ఉప సంచాలకులు సిహెచ్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్ కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అకౌంటెంట్ జనరల్ జిపిఎఫ్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే పే అండ్ అకౌంటెంట్ జనరల్ విజయవాడ వారికి నేరుగా తెలియజేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. జిల్లా అధికారులు, డిడిఒలు హాజరు కావాలని పేర్కొన్నారు. అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ ఎన్.మోహనరావు, ఎస్.శాంతిప్రియ, ప్రిన్సిపల్ ఎకౌంట్ జనరల్ ఎస్.కుషిల్ కార్తీక్, సీనియర్ డిప్యూటీ అకౌంట్స్ జనరల్ ఎస్.బాలాజీ, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ హాజరు కానున్నట్లు తెలిపారు.


టెక్కలి : మంత్రి, గోవిందరాజులుకు గజమాలతో సన్మానిస్తున్న టిడిపి నాయకులు

గోవిందరాజులు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి, టెక్కలి

విజయవాడలో రాష్ట్ర కళింగ వైశ్య, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారాన్ని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత మంగళవారం చేయించారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ బలహీన వర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వైసిపి ప్రభుత్వం గొప్పలు చెప్పుకోడానికి 54 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నగదును దోచేశారని ఆరోపించారు. సిఎం చంద్రబాబు నాయుడు బిసిల కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నారని తెలిపారు. వైశ్యులను ఒబిసిలో ప్రధాని మోడీ, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో చర్చిస్తానని హామీనిచ్చారు. అనంతరం మంత్రి అచ్చెన్నాయుడు, గోవిందరాజులుకు గజమాలతో సత్కరించారు.

టెక్కలికి చెందిన డైరెక్టర్ డోకి రాజేష్, వర్తక సంఘం అధ్యక్షులు లాడి శ్రీనివాసరావు, ప్రతినిదులు మద్ది రామకృష్ణ, డోకి సురేష్, బెలుసోంటి నగేష్, తంగుడు విష్ణు, జామి అనిల్‌కుమార్, డోకి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


బాధితులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

పోస్టల్ బాధితుల ఆందోళన విరమణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పోస్టల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు విరమించారు. జిల్లా తపాలా శాఖ అధికారి ఎస్.పి.హరిప్రసాద్ మంగళవారం నిరసన శిబిరం చేరుకుని మాట్లాడారు. 33 మంది ఖాతాదారుల నుంచి రూ.3 కోట్లు అవినీతికి పాల్పడ్డారని, మోసపూరిత హామీలు ఇవ్వకుండా స్పష్టంగా హామీ ఇవ్వాలని పోస్టల్ బాధితులు అధికారులను గట్టిగా నిలదీశారు. బాధితుల సమక్షం నుంచి నేరుగా పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్‌తో ఫోన్ మాట్లాడి చర్చించారు. అనంతరం జనవరి 15లోగా బాధితులకు న్యాయం చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐపిఒ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపు గరిమెళ్ల స్మారకోపన్యాసం

ప్రజాశక్తి- అరసవల్లి

ఈ నెల 18న గరిమెళ్ళ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన స్వాతంత్ర సమర యోధులు గరిమెళ్ల సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నట్టు జిల్లా కేంద్ర గ్రంథాలయశాఖ కార్యాలయ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ వేత్తలు ఉద్యమకారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

కాండం తొలిచేస్తోంది

● జీడికి వేరు తొలిచే పురుగుతో ముప్పు
● ముందస్తు గుర్తింపుతోనే రక్షణ

ప్రజాశక్తి- కవిటి

జీడి, మామిడి రైతులకు ఇటీవల కాలంలో తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్న వాటిలో కాండం, వేరు తొలిచే పురుగు అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ పురుగు చెట్టును లోపలినుంచే గికి తినేసి, చెట్టు జీవనాధారం తెంచేస్తూ క్రమంగా ఎండిపోయేలా చేస్తుంది. ముఖ్యంగా డిసెంబరు నుంచి మే వరకు దాని ఉధృతి గరిష్ట స్థాయిలో ఉంటోంది. ఆదిలోనే దీన్ని గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టకపోతే తీవ్రమైన నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని ఉద్యాన శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. మే నుంచి మార్చి మధ్యలో రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరిస్తున్నారు.

జీవిత చక్రం-చెట్టు అంతరాళంలో సొరంగాలు

ఈ కాండం తొలిచే తల్లి పురుగు చెట్టు ప్రధాన కాండం, బెరడు పగుళ్లు, బయటకు కనిపించే రవ్వవంటి వేర్లపై బియ్యపు గింజంత గుడ్లను పెడుతుంది. అనంతరం 5 నుంచి 7 రోజుల్లో పుట్టే లద్దె పురుగులు కాండం, వేరులో రంధ్రాలు చేసి లోపలికి చేరుతూ సొరంగాలు ఏర్పరుస్తాయి. పరిమాణం పెరిగేకొద్దీ సొరంగాలూ విస్తరిస్తాయి. దీనివల్ల చెక్కపొడి, నల్లని బంక ఎక్కువగా బయటకు కారుతుంది. జీవరసం ప్రవాహం ఆగిపోవడంతో చెట్టు ఆకులు పసుపు రంగులోకి మారి రాలిపోతాయి. కొమ్మలు ఎండిపోతూ చివరకు చెట్టు పూర్తిగా క్షీణిస్తుంది. ప్రతి పురుగూ 6 నుంచి 8 నెలలు కాండంలో గుడిచేసుకుని, తర్వాత 60 నుంచి 90 రోజుల కోసస్త దశ తరువాత దృఢమైన రెక్కల పురుగుగా బయటకు వస్తుంది. ఈ పురుగు ముఖ్యంగా ఏడు సంవత్సరాల పైన వయస్సు గల, నిర్లక్ష్యానికి గురైన తోటల్లో వేగంగా వ్యాపిస్తుంది. కాబట్టి ముందస్తుగా కాండాన్ని రక్షించడం అత్యంత కీలకం.

నివారణ చర్యలు

కాండం రక్షణ (ముఖ్యమైనది). ప్రతి చెట్టు కాండమూ మూడు అడుగుల వరకు, పైన కనిపించే వేర్లను ఇనుప వైర్, బ్రష్‌తో బాగా రుద్దాలి. అనంతరం 5 శాతం వేపనూనె ద్రావణాన్ని సంవత్సరానికి మూడు సార్లు (ప్రతి నాలుగు నెలలకు ఒకసారి) పిచికారీ చేయాలి. వేపనూనె నీటిలో కలవదు కాబట్టి లీటర్ నీటికి 0.5 గ్రా సబ్బు పొడి కలిపి తరువాత 50 మి.లీ వేపనూనె వేసి బాగా కలపాలి. బంక, చెక్కపొడి కనిపిస్తే వెంటనే బెరడు కొద్దిగా తొలగించి లోపల ఉన్న లద్దె పురుగులను తీసేయాలి. అనంతరం క్లోరిపైరిఫాస్ 10 మి.లీ/లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని పిచికారీ చేయాలి. తొలగించిన బెరడు, చెక్కపొడి, బంకను భూమిలో పాతిపెట్టి నాశనం చేయాలి. మరోవైపు పసుపు రంగుకు మారిన చెట్లను వేరుతో సహా తీయాలి. బయట పడిన కోసస్త దశలను పూర్తిగా నాశనం చేయాలి. గుంటల్లో ఉన్న చెత్తను తగులబెట్టాలి.

టీ, తేయాకు దోమ

నష్టం: లేత చిగుళ్లు, పూతలు మీద ఎర్రటి జిగురు బిందువులు, పూత, పిందె మీద నల్ల మచ్చలు, దిగుబడి తగ్గుదల.

నివారణ: దీని నివారణకు కొత్త చిగురు దశలో మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ/లీ, పూత దశలో లాంబ్డా సైహాలోథ్రిన్ 0.6 మి.లీ/లీ, క్లోరిపిరిఫాస్ 2 మి.లీ/లీ, గింజ బటానిసైజ్‌లో ప్రోఫెనోఫాస్ 1 మి.లీ/లీ డిసెంబరు శాతం మార్చి మధ్య 2-3 సార్లు పిచికారీ చేస్తే మంచి నివారణ లభిస్తుంది.

ఆకు-పూత గూడు కట్టు పురుగు

కొత్త చిగుర్లు, పూతలను గూడు కట్టి వదులా చేస్తుంది. పండ్ల ఏర్పాటు ఆగిపోతుంది.

కొమ్మ-పుష్పగుచ్ఛాలు తొలిచే పురుగు

కొమ్మల్లో సొరంగాలు చేస్తూ నశింపజేస్తుంది. దిగుబడి గణనీయంగా తగ్గుతుంది.

కాయ గింజ తినే పురుగు

కాయలోనికి ప్రవేశించి గుజ్జును, గింజను తినేస్తుంది. కాయలు కుళ్లిపోతాయి.

తామర పురుగులు

ఇవి వర్షాకాలంలో అధికం. చెట్టుపై గీకి రసం పీల్చడంతో మచ్చలు పెరిగి నాణ్యత తగ్గుతుంది. వీటి నివారణకు డైమెథోయేట్ 2 మి.లి, ఫోనోఫాస్స్ 1.6 మి.లీ/లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పిండి నల్లి

చెట్టు మొత్తం రసం పీల్చి చెట్టు క్షీణిస్తుంది. తేనె జిగురు మీద మసి తెగులు పెరుగుతుంది.

నివారణ: బాధిత భాగాలను కత్తిరించి నాశనం చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే డైక్లోరోవాస్ 2.5 మి.లి, డైమెథోయేట్ 1.75 మి.లి, అసిఫేట్ 1.5 గ్రా/లీ ద్రావణంతో పిచికారీ చేయాలి.

తెగుళ్లు

బ్లైట్: పుష్పగుచ్ఛాలు, పిన్న గింజలు మెత్తబడి ఎండిపోతాయి.

నివారణ: కార్బెండాజిం 1 గ్రా/లీ పిచికారీ చేయాలి


చెట్టు మొదట్లో కారుతున్న బంక (ఇన్‌సెట్‌లో జీడిని ఆశిస్తున్న పురుగులు)

దిగుబడి

నాణ్యమైన అంటునుంచి తీసిన జీడి మొక్కలో మూడో సంవత్సరం నుంచే కాపు మొదలవుతుంది. సరైన రకాల తోటల్లో పది సంవత్సరాల వయసులో ఒక్కో చెట్టు నుంచి 10 కిలోలకంటే ఎక్కువ గింజ దిగుబడి సులభంగా వస్తుంది. ఒక కిలో జీడిపిక్కలలో 250 గ్రాములకు పైగా పప్పు లభిస్తుంది. అయితే రాలిన జీడి పండ్లను సేకరించి, పిక్కలను వేరు చేసి వారం రోజులు పాటు పిక్కలు ఎండబెట్టడం మంచిది.

సమగ్ర సస్యరక్షణ జీడి తోటలకు మేలు



తొలి దశలోనే పురుగులను గుర్తించి చర్యలు చేపడితే జీడి, మామిడి తోటలను పూర్తిగా రక్షించవచ్చు. క్రమం తప్పని పిచికారీలు, పరిశుభ్రత, కాండం బ్రషింగ్ జీడి తోటలకు రక్షణ కవచం. ఇవి పాటించిన రైతులు శత శాతం ఫలితాలు పొందుతున్నారు.

- పోలాకి మాధవీలత, ఉద్యానశాఖ అధికారి, కవిటి

మహాసభలను విజయవంతం చేయాలి


పొందూరు : మాట్లాడుతున్న అమ్మన్నాయుడు

ప్రజాశక్తి- పొందూరు

ఈ నెల 31 నుంచి వచ్చే నెల 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. పొందూరులో రాజ్యలక్ష్మి పోల్స్ పరిశ్రమ వద్ద కార్మికులతో మంగళవారం మాట్లాడారు. దేశంలో కోటిమంది సభ్యులున్న అతి పెద్ద కార్మిక సంఘం సిఐటియు అని అన్నారు. ఐక్యత పోరాటం నినాదంతో కార్మిక హక్కుల కోసం నిరంతరం పోరాతుందన్నారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పేడాడ. అప్పలనాయుడు, కె. గోవిందరావు, రాంబాబు, మల్లేషు, భాస్కరరావు పాల్గొన్నారు.

జలుమూరు: ఈ నెల 31 నుంచి వచ్చే 4 వరకు విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి పిలుపునిచ్చారు. జలుమూరులో మంగళవారం కమిటీ సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గాన్ని ఐక్యపరిచి సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ఉద్యోగ, కార్మిక, కర్షక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిఐటియు అని కొనియాడారు. జనవరి 4న విశాఖ బీచ్‌లో లక్షలాది మంది కార్మికులతో జరిగే బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు కె.కన్యాకుమారి, ఎం.రాధ, పి.కళావతి, జె.కళ్యాణి, వి.నీలవేణి, పి.సుజాత పాల్గొన్నారు.


జలుమూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహాలక్ష్మి

పెన్షనర్స్ డేను విజయవంతం చేయాలి

ఆమదాలవలస : జాతీయ పెన్షనర్స్ డే వేడుకల్లో పెన్షనర్లు పాల్గొని విజయవంతం చేయాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్ధనరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఉప ఖజానా అధికారి కార్యాలయ ఆవరణలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సురవరపు సిమ్మినాయుడు అధ్యక్షతన సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుధవారం ఉదయం 9.30 గంటలకు పెన్షనర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్.వి. సత్యనారాయణ, ఉపాధ్యక్షులు డి.లక్ష్మణరావు, ఎన్.చంద్రశేఖరరావు, కె.షణ్ముఖరావు, కార్యదర్శులు పివిఎన్ మాస్టారు, పేడాడ భానుజీరావు, కర్నేన జనార్ధనరావు, కాగితాపల్లి సంజీవరావు, కె.కోటేశ్వరరావు, ఎన్. వాసుదేవరావు, బి.చిట్టయ్య, ఎన్.సూర్యనారాయణ, బి.వెంకటరమణ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

శ్రీకాకుళం సిటీ: గార మండలం తూలుగు సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఫోరం ఛైర్మన్ బి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని వెల్లడించారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ఇంటి పన్ను వసూలు చేస్తున్న కార్యదర్శి కామరాజు

దేవునల్తాడలో ఇంటి పన్ను వసూలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని కార్యదర్శి కామరాజు గ్రామస్తులను కోరారు. మండలంలోని దేవునల్తాడ సచివాలయంలో మంగళవారం ఇంటి పన్ను వసూలు డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో 991 ఇంటికి పన్నులు చెల్లించాలని సమాచారం అందజేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3,56,786 గాను, 269 ఇళ్ల యజమానుల నుంచి రూ.1,02,670 ఇంటి పన్ను వసూలు చేశామని తెలిపారు. మిగిలినవారు సచివాలయ అధికారులను సంప్రదించాలని కోరారు.


సన్మానిస్తున్న చేనేత కార్మికులు

సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి- లావేరు


టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్‌ను చేనేత కార్మికులు మంగళవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఇటీవల చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో తాళ్లవలసలో ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఎప్పుడు సమస్య వచ్చినా ఎమ్మెల్యే ఈశ్వరరావు సహకారంతో సమస్యల పరిష్కారానికి తాము కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు ఉప్పు జీవానందం, కాసిన వెంకటరమణ, ఇనుమూర్తి వెంకటరావు, ఉప్పు విరరాజు, తూతిక కుమార్, బళ్ల బాబూరావు పాల్గొన్నారు.

సందేశాత్మక చిత్రాన్ని ఆదరించాలి

ప్రజాశక్తి- కవిటి

యూనివర్సిటీ (పేపర్ లీక్) ఒక సందేశాత్మక చిత్రమని, దానికి ప్రతి ఒక్కరీ ఆదరణ అవసరమని సినీనటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను మంగళవారం కలిసి యూనివర్సిటీ సినిమా చూడాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా అశోక్ తండ్రి ప్రకాష్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ సందర్భంగా ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పర్యటించిన విషయాలను, ఎమ్మెల్యే తండ్రి ప్రకాష్ అందించిన సహకారాన్ని ఎమ్మెల్యేకి తెలిపారు. ముఖ్యంగా విద్యా వ్యవస్థలో అంతర్లీనంగా జరుగుతున్న దోపిడీ, పేద, బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయాన్ని ఈ చిత్రం ప్రతిబింబిస్తుందని నారాయణమూర్తి తెలిపారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలనేదే తన లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కొర్రాయి వాసుదేవ్ యాదవ్, లోళ్ల శ్రీను, జర్నలిస్టు జి.షణ్ముఖరావు పాల్గొన్నారు.


విప్ అశోక్‌తో నారాయణమూర్తి


పరిశీలిస్తున్న అప్పన్న

ఆధార్ క్యాంపు పరిశీలన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఫ్రీ ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ, జిఎస్‌డబ్ల్యుఒ దుంపల అప్పన్న అన్నారు. పొందూరు మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఫ్రీ ఆధార్ బయోమెట్రిక అప్‌డేషన్ క్యాంపును మంగళవారం పరిశీలించారు. మండలంలోని లోలుగు, తాడివలస, పొందూరు-2, రాపాక-1, కనిమెట్ట గ్రామాల్లో ఈ ఆధార్ అప్‌డేషన్ క్యాంపులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 24 వరకూ ఈ క్యాంపులను నిర్వహించనున్నామని, ఇంకా 5 నుంచి 17 ఏళ్ల వయసు కలిగి ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేషన్‌ను చేసుకోని వారు తప్పనిసరిగా అప్‌డేషన్‌ను చేసుకోవాలని కోరారు. ఈయనతో పాటు ఇఒ పొన్నాడ జగదీష్, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

కళా ఉత్సవ్‌కు కవిటి విద్యార్థులు

కవిటి: మహారాష్ట్రలోని పూణేలో ఎన్‌సిఇఆర్‌టి ఆధ్వర్యాన నిర్వహించే జాతీయ స్థాయి కళాఉత్సవ్ పోటీలకు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఎం.అఖిల్, కె.వికాస్‌లు ఇండిజీనియస్ టాయ్స్ మేకింగ్ (కొబ్బరి పీచు బొమ్మల తయారీ) విభాగంలో జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి, ప్రధానోపాధ్యాయులు విశ్వనాథం, ఎస్‌ఎంసి ఛైర్మన్ మోహనరావు అభినందించారు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు యు.గిరిబాబు, పి.బి.కె.శర్మలను ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో జాతీయ స్థాయిలో కూడా మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఇఒ

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించాలి


మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

రణస్థలం: గొప్ప సేవా దృక్పథంతో జాతికి విశేష సేవలను అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింత విస్తరించాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. మండలంలోని మరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు యూనిఫామ్ వితరణ కార్యక్రమం మంగళవారం అందజేశారు. యూనిఫామ్ కోసం విరాళాలు ఇచ్చిన దాతలు మరువాడ సర్పంచ్ జె.అచ్చిబాబు, మరువాడ జనసేన నాయకులు జె.బంగార్రాజు, బి.రాము, జి.రాజు, వై.శ్రీనివాసరాజులకు కృతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం.సరిదేవి శివశంకర్, స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు, ఉపాధ్యాయులు జి.బుజ్జిబాబు, సిహెచ్.రాజేశ్వరి, వై.ప్రమీల, ఎస్.రహీమ్, టి.సురేష్, బి.జి.హరనాథ్, జి.చిన్నికృష్ణం నాయుడు, పి.శ్రీదేవి, పి.సత్యవతి పాల్గొన్నారు.

కె.ఎస్ పురం శ్మశానం కబ్జా!

శవ దహనానికి ఇబ్బందులు

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరు పంచాయతీ పరిధి కేశవరాయపురంలో ఉన్న రణస్థలం-రాజాం రోడ్డుని అనుకుని ఉన్న శ్మశానాన్ని ఇటీవల లావేరుకు చెందిన ఆక్రమారులు ఇటుకలు, వ్యర్థాల కూడిన మట్టితో కప్పేశారు. దీంతో శవ దహనం చేసేందుకు లోపలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు మంగళవారం గ్రామానికి చెందిన గురిజా నీలమ్మ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని దహనం చేయడానికి తీసుకెళ్లిన గ్రామస్తులు ఇబ్బందులు పడ్డాడు. అధికారులు, పంచాయతీ పాలకుల పర్యవేక్షణ లేకపోవడంతో రహదారిపైన, శ్మశానాల్లోను వ్యర్థాలను పడేస్తున్నారు. రహదారి గుండా ప్రయాణిస్తున్న వాహనాదారులు ప్రమాదాలు భారీన పడుతున్నారు. మాకు అడ్డేలేదన్న చందంగా మాఫియా రెచ్చిపోతుంది. అధికారులు ఇటువంటి జరగకుండా చర్యలు తీసుకోవాలని శ్మాశనంలో వేసిన మట్టిని తరలించి ఇబ్బందులు లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు

విచారణ చేపడతాం

కేశవరాయనిపురం శ్మశనంలో మట్టి రాళ్లు, ఇటుకులు వ్యర్థాలతో కప్పివేసిన వారిపై విచారణ చేసి బాధ్యలకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ గురుగుబెల్లి ఈశ్వర శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ స్థలాలు, రహదారుల కబ్జా చేసిన పూడ్చి వేసిన వ్యర్థాలు వేసిన వారిపై రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల ద్వారా అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు తక్షణమే రెవెన్యూ సిబ్బందిని పరిశీలన విచారణకు పంపిస్తున్నట్టు చెప్పారు.


శ్మశానంలో వేసిన మట్టి రాళ్లు

పాఠశాల తాగునీటి సమస్యకు పరిష్కారం


శంకుస్థాపన చేస్తున్న మృత్యుంజయరావు

ప్రజాశక్తి- కంచిలి

కంచిలి మండల పరిధిలోని మకరాంపురం పంచాయతీ, సాలినపుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి సదుపాయం లేని విషయాన్ని గ్రామ పెద్దలు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు స్థానిక నేత, వైసిపి మండల అధ్యక్షులు వజ్జ మృత్యుంజయరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి తన సొంత నిధులతో రూ.1.50 లక్షల అంచనా వ్యయంతో పాఠశాల బోరు బావి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యకు తాగునీరు ఎంతో అవసరమని అన్నారు. భవిష్యత్‌లోనూ పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు సహాయం అందిస్తానన్నారు. కార్యక్రమంలో అప్పారావు, వజ్జ కృష్ణారావు, ఎస్.భాస్కరరావు, త్రినాథ్, బాలస్వామి, తమ్మయ్య, తమరాల లక్ష్మణమూర్తి, సాలిన లక్ష్మణమూర్తి, లోళ్ల రామమూర్తి జోగారావు, రాంబాబు, త్యాగరాజు, జగన్మోహన్, విజయ్, వెంకటరమణ, రమేష్, అనీల్, శివ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దమడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను రెసిడెన్షియల్ కళాశాలల అకడమిక్ డిప్యూటీ రాష్ట్ర సెక్రటరీ ఎస్.జి.కిషోర్ బాబు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కళాశాల పరిసరాలను పరిశీలించి, విద్యా సంబంధిత రికార్డులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం నేషనల్ 69వ ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ అండర్-19 విభాగంలో బాల బాలికల కేటగిరీలో నేషనల్ హడిల్స్‌లో 33వ స్థానం సాధించిన గోవిందను, నేషనల్ ట్రిపుల్ జంప్‌లో 11వ స్థానం సాధించిన కృప సింధును అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఈ.ఎల్.నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ రామానందం, పాఠశాల ప్రిన్సిపాల్ అజిత్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, పీడీ లక్ష్మణ్‌మూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిషోర్‌బాబు


అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

శివానీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

విజయవాడలోని పిఎస్‌సిఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీలో మంగళవారం నిర్వహించిన జాతీయ స్థాయి హ్యాకథాన్ మైండ్ స్ప్రింట్ 2కె25లో శివాని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లి విద్యార్థులు ఆవిష్కరణ, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించి ప్రతిభ చూపారు. మొత్తం 40 మంది విద్యార్థులు పాల్గొనగా దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ప్రసిద్ధ సంస్థల జట్లతో 36 గంటల పాటు పోటీ పడ్డారు. ప్రతిభచాటిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

రేపట్నుంచి భద్రతా మహోత్సవాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలోని అన్ని పోస్టాఫీసుల్లో బీమా ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి 20 వరకు కుటుంబ భద్రత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు శ్రీకాకుళం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ వి.హరిబాబు ఒక ప్రకటనలో చెప్పారు. జీవిత బీమాపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రూ.4 కోట్లు ప్రీమియం లక్ష్యమని చెప్పారు. తక్కువ ప్రీమియంతో బీమా, అధిక బోనస్, లాభదాయ కరిటర్న్స్ వంటి వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు.


వివాదానికి కారణమైన స్థలం

డి పట్టా భూముల్లో వివాదం

పలాస : మండలంలోని కోసంగిపురం కూడలి బొడ్డపాడు రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నంబరు 67లో ఆరు సెంట్లు భూమి కోసం మంగళవారం కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన తాళాసు ఈశ్వరరావు, మరో వ్యాపారి హరి తగదా పడ్డారు. ఈశ్వరరావు తన స్థలంలో కుందలు పాతు తుండగా మరో వ్యాపారి హరి విషయం తెలుసుకొని నా స్థలంలో పనులు ఏలా చేస్తావంటూ వాగ్వాదానికి దిగారు. ఇరువురు మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. మాటకు మాట పెరిగి ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ఈశ్వరరావు తనకు చెందిన స్థలాన్ని తనకే చెందాలని పలాస కోర్టులో దావా వేయగా, తనకు అనుకూలంగా ఇంజిక్షన్ ఆర్డరు అందించింది. భవన నిర్మాణ కార్మికులను వెంటపెట్టుకొని సర్వే నంబరు 67లో వివాద స్థలానికి చేరుకొని కంచె నిర్మాణం చేపట్టడానికి ఉపక్రమించారు. చివరికు ఈశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురినీ పోలీస్‌స్టేషన్‌కు రావాలని పోలీసులు చెప్పారు. రెవెన్యూ, పోలీసులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి నిర్ణయానికి వస్తారని, అంతవరకూ ఇరువర్గాలు పనులు ప్రారంభించవద్దని సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

అందరి సహకారంతో విజయవంతం

ప్రజాశక్తి- నరసన్నపేట

వైసిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, నియోజకవర్గ ప్రజల సహకారంతోనే కోటి సంతకాల సేకరణ, ర్యాలీ విజయవంతమైందని పోలాకి జెడ్‌పిటిసి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. అందుకే వారంతా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంతకాలు చేశారన్నారు. ఈ కారణంగానే జిల్లాలో అత్యధికంగా నరసన్నపేట నియోజకవర్గంలోనే 60 వేల సంతకాలను నమోదు అయ్యాయన్నారు. దీనివెనుక పార్టీ నాయకులు, కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. పోలీసులను ప్రయోగించి ర్యాలీని అడ్డుకోవడానికి అధికార పార్టీ నానా తంటాలు పడిందన్నారు. అయినా పార్టీ శ్రేణులు, ప్రజలు ఎక్కడా వెనక్కు తగ్గకుండా ర్యాలీకి పెద్ద సంఖ్యలో హాజరై తమ మద్దతు ప్రకటించారన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, లోకేష్‌లకు కనువిప్పు కలగాలన్నారు.

టిడిపి శిక్షణలో పాల్గొన్న నాయకులు

కొత్తూరు : విజయవాడలోని మంగళగిరిలో కొత్తూరు టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు, ప్రధాన కార్యదర్శి ఆరుబోలు దశరథలు మంగళవారం నిర్వహించిన శిక్షణలో పాల్గొన్నారు. ఈ శిక్షణ లో పార్టీ పటిష్టకు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేసినట్లు వారు తెలిపారు.

ఆరోగ్యం, పోషణపై అవగాహన

టెక్కలి రూరల్ : టెక్కలి ఐతమ్ కళాశాలలో మహిళా అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన 'మహిళా ఇంజినీర్లకు ఆరోగ్యం, పోషణ'పై మంగళవారం అవగాహన కల్పించామని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ముఖ్య వక్తగా సింబయోసిస్ టెక్నాలజీస్‌కు చెందిన కన్సల్టెంట్ న్యూట్రిషనిస్ట్ డి.పూజిత పాల్గొని, సమతుల్య ఆహారం, ఆరోగ్యకర జీవనశైలి, పని ఒత్తిడిని ఎదుర్కొనే మార్గాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని మహిళా అభివృద్ధి కమిటీ సమన్వయకర్త ఇసిఇ విభాగపు అధ్యాపకులు డాక్టర్ కె.వి.లలిత భవానీ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



మెమొంటో అందజేస్తున్న నాగేశ్వరరావు

ఉత్సాహంగా గణిత పోటీలు


ప్రారంభిస్తున్న ఎంఇఒ అప్పారావు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో గణిత దినోత్సవం పురస్కరించుకొని గణిత ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభించారు. కంచలి, కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం మండలాలు నుంచి 150 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఎంఇఒలు కె.అప్పారావు, ఎస్.విశ్వనాథం, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావులు ప్రారంభించారు. సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక జి.ఢిలేశ్వర్, జి.ప్రసాదరావు, బి.ఆదినారాయణ, ఇచ్ఛాపురం డిగ్రీ కాలేజ్ ఫిజిక్స్ లెక్చరర్ సంతోష్‌కుమార్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎపిఎంఎస్ సోంపేట, కంచిలి మండలానికి జెడ్‌పిఎంఎస్ పల్లి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఇచ్ఛాపురం మండలం బలరాంపురం ఎంపియుపి స్కూల్ తృతీయస్థానం సాధించింది. సీనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలిగాం (ఇచ్ఛాపురం), ద్వితీయ స్థానంలో ఎంఎంఎస్‌పల్లి పల్లీ మోడల్ స్కూల్ కంచిలి, తృతీయ స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మఖరాంపురం (కంచిలి) నిలిచాయి. ముఖ్య అతిథులు చేత క్యాష్ ప్రైజ్, మెమోంటోలు, ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందించారు. కార్యక్రమంలో సోంపేట మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డి.చిన్నాజీ వర్మ, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.సూర్యారావు, తోటూరు హెచ్ఎం సరోజని పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై జగడం

ప్రజాశక్తి- టెక్కలి

భవానీనగర్ వద్ద నూతనంగా నిర్మాణం చేపడుతున్న కట్టడం వివాదస్పదంగా మారింది. ఆ ప్రాంతానికి చెందిన టిడిపికి చెందిన ఓ నాయకుడు ఆ భవనం నిర్మాణం చేపడుతున్న విషయమై చెలరేగిన వివాదం స్థానికుల ఆగ్రహానికి గురైంది. భవానీనగర్ నుంచి అయ్యప్పనగర్‌కు మధ్య గల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు తమ సొంతానికి వినియోగించుకునే నిమిత్తం ఆక్రమణ చేపట్టారు. ఇటీవల ఆ మార్గం విస్తరణ జరగడంతో ఆక్రమిత స్థలాన్ని విలువ పెరగడంతో సదరు ఆక్రమితదారులు నిర్మాణం చేపట్టారు. దీనిపై గతంలో స్థానికులు ఆడ్డుకుని నిలదీశారు. తాము మంత్రి తాలూకా మనుషలమని, తాము చెప్పిందే మంత్రి వింటారని చెప్తూ ఆక్రమణదారులు స్థానికులను నమ్మబలికారు. ఈ నేపథ్యంలో భవనం నిర్మాణం పనులు కూడా జోరందుకోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి



ఆక్రమణదారులను ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో వివాదం జరగడంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడకు చేరుకుని వివాదాన్ని సద్దుమణిగించారు. ఈ విషయమై టెక్కలి తహశీల్దార్ సత్యంను వివరణ కోరగా, వివాదస్పద స్థలం పరిశీలించామని, ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నామని అన్నారు. ప్రాథమికంగా అది ప్రభుత్వ స్థలమేనని ఆక్రమ నిర్మాణాలు చేపడితే తొలగిస్తామని తెలిపారు.

వేడి నీరు పడి మహిళ మృతి

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని కేశవరాయునిపాలెంకు చెందిన నాయిన నిర్మల (40) వంటిపై వేడినీరు పడడంతో మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే... నిర్మల గత నెల 19న ఇంటి వద్ద కర్రల పొయ్యిపై మరుగుతున్న వేడినీటిని కిందకి దించింది. ఈ క్రమంలో చేజారడంతో వేరు నీరు ఆమె ముఖం, గుండెపై పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు 108లో చికిత్స నిమిత్తంగా శ్రీకాకుళం రిమ్స్ చికిత్సకు తరలించారు. అక్కడ నయం కాకపోవడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందారు. ఈమె అత్తవారు జి.సిగడాం. ఈమె భర్త శివన్న తాపీ పనినిమిత్తంగా విశాఖపట్నంలో ఉంటున్నారు. దీంతో ఆమె మూడు నెలలుగా కన్నవారు స్వగ్రామం కేశవరాయునిపాలెంలో ఉంది. ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ఎం.రాజారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకునికి గాయాలు

లావేరు : మండలంలోని బెజ్జిపురం జాతీయ రహదారిపై మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో రణస్థలానికి చెందిన యువకుడు లావేటి నవీన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. రణస్థలం నుంచి బైక్‌పై శ్రీకాకుళం వెళ్తున్నారు. బెజ్జిపురం వద్దకు బైక్ డివైడర్‌ను ఢీకొన్నాడు. వెంటనే స్థానికులు 108లో శ్రీకాకుళం తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు సమాచారం లేదు.


సెల్యూట్ చేస్తున్న విద్యార్థులు

ఘనంగా కార్గిల్ దివస్

ప్రజాశక్తి- కవిటి

కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మంగళవారం కార్గిల్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ముందుగా భరతమాత చిత్రపటానికి జాతీయ పతాకాలతో అలంకరించి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సెల్యూట్ చేశారు. అనంతరం ప్రిన్సిపల్ బిందుమాధవి కార్గిల్ యుద్ధం ప్రాముఖ్యత, కార్గిల్ ప్రాంత విశిష్టత, కార్గిల్ దివాస్ నేపథ్యాన్ని విద్యార్థులకు వివరించారు. దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన వీరజవాన్ల స్ఫూర్తితో ప్రతి విద్యార్థీ సైనిక వృత్తిలో భారతదేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసన్నపేట: స్థానిక మాజీ సైనికుల భవనము వద్ద విజయ్ దివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సైనిక మాజీ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు దుప్పట్ల మురళి, ఉపాధ్యక్షులు పాగోటి జానకిరామ్, సెక్రటరీ అరంగి ఆనందరావు, ట్రెజరర్ పంగ లక్ష్మణరావు, ఇసి మెంబర్లు ఎన్.మల్లేశ్వరరావు, పెనుగుడూరు రమణ, ఎ.చందరరావు, డి.రామారావు, బోర వెంకటరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విశ్వక్సేన్

నాగబాబు ఎచ్చెర్లను ఎంచుకోవడం హర్షణీయం

లావేరు: జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి బాధ్యతలు స్వీకరించడం హర్షణీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహణ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ విశ్వక్సేన్ అన్నారు. జనసైనికులు, వీరమహిళలు, నాలుగు మండలాల్లోని అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు నాగబాబుకి ధన్యావాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ మాట్లాడుతూ నాగబాబు రాకతో ఉత్తరాంధ్ర, నియోజవకర్గం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎమ్మెల్యే ఈశ్వరరావుతో కలిసి ముందుకు తీసుకెళ్తామని అన్నారు.

కరజాడ విద్యార్థులకు పతకాల పంట

మెళియాపుట్టి: ఈ నెల 10 నుంచి 12 వరకు పాతపట్నం నియోజకవర్గ స్థాయిలో కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రిగ్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో మండలంలోని కరజాడ పాఠశాలకు చెందిన 35 మంది విద్యార్థులకు క్రీడలు, ఆటల్లో 70 పతకాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది, పీడీ దాసరి దీనబంధును అభినందించారు. కె.శ్రీరాములు, జి.గోపాలకృష్ణ, సిహెచ్.యతిరాజరావు, పి.రామారావు, స్టాఫ్ సెక్రెటరీ ఎల్.వెంకటాచలం, ఇ.నారాయణరావు, పి.ప్రమీల, ఆర్.పుష్పకుమారి, ఆర్.సింహాచలం, కె.కిరణ్, సీమ జగదీష్ పాల్గొన్నారు.


అభినందిస్తున్న హెచ్ఎం రమణమూర్తి

రూ.6.55 కోట్లతో 36 ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వ ప్రజా ఆరోగ్యంపై దృష్టిపెడుతూ రూ.6.552 కోట్లతో మందస మండలంలో 15, పలాస మండలంలో ఏడు, వజ్రపుకొత్తూరు మండలంలో 14 (విలేజ్ హెల్త్ క్లినిక్, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్స్, ఆస్పత్రులను) అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. దీనిని పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, ఎపిఎంఎస్ఐడిసి శాఖలు నిర్వహణ చేయనున్నాయి. త్వరలో నిర్మాణాలు పూర్తి చేయనున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే గౌతు శిరీషలకు నియోజకవర్గ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.


సన్మానిస్తున్న నారాయణరావు

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులకు ఇదొక స్వర్ణయోగమని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ, ఎన్‌జిఒ రాష్ట్ర నాయకులు కిలారి నారాయణరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇటీవల బదిలీపై వెళ్లిన పలువురు ఉద్యోగులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా అనేక సేవలు అందిస్తూ ఒకే స్థాయిలో పనిచేస్తూ వచ్చిన ఉద్యోగులకు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఉద్యోగోన్నతులకు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం నాయకులు బి.నరేష్, బి.రమేష్, కె.బాలకృష్ణ, పల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

'మహిళలకు ప్రాధాన్యం లేదు'

ప్రజాశక్తి- టెక్కలి

కళింగ కోమట్ల రాష్ట్ర కార్పొరేషన్ పదవులు నియామకంలో మహిళలకు స్థానం కల్పించకపోవడం శోచనీయమని నీటి సంఘం మాజీ అధ్యక్షులు సత్తారు వెంకటరమణ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఒక చైర్మన్‌తో పాటు పదిహేడు మందిని డైరెక్టర్లుగా ఎన్నుకుని నియమించుకున్నారని అన్నారు. కానీ, మహిళాసాధికారతకు స్థానం ఎక్కడా లేదన్నారు. ఏకపక్షంగా నియామకం జరిగిందే గానీ చట్టపరంగా ఉన్న హక్కులకు భంగం కల్పించారన్నారు. రాష్ట్ర కమిటీగా నియమించినా మహిళలకు స్థానం కల్పించకపోవడం చూస్తుంటే మహిళా సాధికారతపై టిడిపికి ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు.

విప్ అశోక్ పరామర్శ

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మంగళవారం పరామర్శించారు. మండలంలోని భైరిపురం సర్పంచ్ పుల్లట రమాదేవి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందింది. ఆ కుటుంబాన్ని పరామర్శించిన విప్ రమాదేవి భర్త ప్రభాకరరావు ధైర్యం చెప్పారు. అదే సమయంలో చండిపుట్టుగ, లండారిపుట్టుగ పంచాయతీల్లో మృతి చెందిన టిడిపి నాయకుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ఫ్లైఓవర్ల నిర్మాణం

ప్రభుత్వ విప్ అశోక్


అధికారులతో మాట్లాడుతున్న విప్ అశోక్

ప్రజాశక్తి- కవిటి

ప్రజల ఆస్తులకు ఇబ్బందులు లేకుండా రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణపు పనులు చేపట్టాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ సూచించారు. ఈ మేరకు మంగళవారం రైల్వే జోనల్ అధికారి చంద్రమోహన్ నాయక్, ఇచ్ఛాపురం తహశీల్దార్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఇచ్ఛాపురం కొలిగాం మార్గంలో ఉన్న ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై అధికారులకు పలు సూచనలు చేశారు. బ్రిడ్జి నిర్మాణ సమయంలో సమీపంలో ఉన్న ప్రజల ఆస్తులను దృష్టిలో పెట్టుకొని పని చేయాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వ్యవహరించాలని ఆదేశించారు. అవసరమైతే మరోసారి క్షేత్రస్థాయికి వచ్చి పరిశీలిస్తానని అశోక్ తెలిపారు. అదే సమయంలో ప్రజల సౌకర్యార్థం రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, టిడిపి నాయకులు కాళ్ల జయదేవ్, జిలానీ. గౌరీ, జన్నెల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పోలాకి

ఈ నెల 21న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యాధికారి డాక్టర్ శ్రీనాథ్ పిలుపునిచ్చారు. పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్ ఆధ్వర్యాన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు ఉన్న ప్రతి ఒక్కరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. 27 బూత్‌లు 47 టీమ్‌లు ఒక మొబైల్ టీం ముగ్గురు పర్యవేక్షకులతో ప్రత్యేకమైన సర్వలెన్స్ చేపడుతూ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని వ్యాక్సినేటర్స్ ట్రైనింగ్‌లో పేర్కొన్నారు. పోలకి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో 3121 మంది చిన్నారులు, 11,121 గృహాలు ఉన్నాయని తెలిపారు. మొదటి రోజు బూతులో పిల్లలకు వ్యాక్సినేషన్


మాట్లాడుతున్న రవికుమార్

వేస్తారన్నారు. రెండు, మూడో రోజు గృహ సందర్శన నిర్వహిస్తూ మొదటి రోజున తప్పి పిల్లలకు వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. సమావేశంలో పిహెచ్ఎన్ మోహిని, పర్యవేక్షకులు మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి


మాట్లాడుతున్న రమణ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధిపై కార్యదర్శులతో మంగళవారం సమీక్షించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల వసూళ్ల పురోగతి, స్వామిత్వ సర్వే, ఇతర సర్వేల అమలు తీరుపై సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ఇంటి పన్నుల వసూళ్లలో వేగం పెంచడంతో పాటు స్వామిత్వ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, కార్యదర్శులు శివాజీ, డి.వాసుదేవరావు, ఢిల్లీరావు, మోహనరావు పాల్గొన్నారు.

ఆవుకు అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పైడిభీమవరానికి చెందిన నీలాపు చైతన్య అనే రైతుకు చెందిన పాడి ఆవు కంటికి పెన్సింగ్ వైరు గుచ్చుకుంది. కన్ను పూర్తిగా పోవడంతో పాటు ఇన్‌ఫెక్షన్ అయ్యింది. దీంతో రణస్థలం పశువైద్య శాలలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు బంటుపల్లి దుర్గారావు పర్యవేక్షణలో పైడిభీమవరం పశువైద్యాధికారి వై.పూర్ణిమ, బెజ్జిపురం పశువైద్యాధికారి లావణ్య శస్త్రచికిత్స చేసి పూర్తిగా కన్నును తొలగించారు. తన ఆవుకు కంటి


ఆవుకు శస్త్రచికిత్స చేస్తున్న పశువైద్యాధికారులు

భాగంలో గాయం కావడంతో స్థానిక పశు వైద్యశాలలో పాడి రైతు చైతన్య పరీక్షలు చేయించాడు. ఈ శస్త్రచికిత్స సుమారు రెండు గంటల సమయం పట్టింది. పాడి రైతులు వైద్యులను అభినందించారు.


పరిశీలిస్తున్న ఎంపిపి పుష్ప

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని ఎంపిపి బోర పుష్ప మధ్యాహ్న భోజన వంట కార్మికులకు ఆదేశించారు. మండలంలోని కె.శాసనం పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంటలు వండేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రుచి, శుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం స్వయంగా వంటశాలకు వెళ్లి వంటలను పరిశీలించారు. అంతకుముందు విద్యార్థులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పైడి గోపాలరావు, కారింగ త్రినాథ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని సిరసువాడ-కుంటిభద్ర బీటి రోడ్డు 20 ఏళ్ల క్రితం నిర్మాణం చేపట్టారు. అయితే ఈ రోడ్డు పాడవ్వడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఆరు నెలల క్రితం రహదారి పనులకు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శంకుస్థాపన చేశారు. ఆ పనులను కాంట్రాక్టర్ మధ్యలో నిలుపుదల చేశారు. ఎమ్మెల్యే స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మళ్లీ కాంట్రాక్టర్ పనులు ప్రారంభించడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు అగతముడి అరుణ్‌కుమార్ పనులను పరిశీలించారు.

21న అంతర్జాతీయ మెడిటేషన్ దినోత్సవం

ప్రజాశక్తి- అరసవల్లి

ఈ నెల 21న అంతర్జాతీయ మెడిటేషన్ డే ఘనంగా నిర్వహిస్తున్నట్లు విశాఖపట్నం నుంచి వచ్చిన బ్రమ్మ కుమారీస్ మీడియా ప్రతినిధి రామేశ్వరి తెలిపారు. ఈ మేరకు 2026 కేలండర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ ంసదర్భంగా మాట్లాడుతూ అందరికీ ధ్యాన ప్రక్రియ నిత్య అవసరమని తెలిపారు. మానసిక, ఏకాగ్రత శారీరక ఆరోగ్యంతో అవసరమని అన్నారు. అనంతరం బలగ మెట్టులోని 50 మందికి పైగా మహిళలకు ధ్యానం గురించి తెలియజేశారు. రాజయోగ సెంటర్ ఇన్‌ఛార్జి బి.కె.జయలక్ష్మి, శ్రీదేవి, సిద్ధు శ్రీనివాస్, భవాని పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

పోలాకి: మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ స్కూల్‌లో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.శ్రీరామ్మూర్తి ఆధ్వర్యాన క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళవారం సన్మానించారు. అలాగే గ్రిక్స్ పోటీల్లో రాష్ట్రస్థాయి ఫెన్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన కె.చందుకి అభినందించారు. కార్యక్రమంలో పీడీ ఎం.నీలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.